సాక్షి
తిరుపతి
సోమవారం, 25, సెప్టెంబర్, 2023



బీమా.. మరింత ధీమా!

ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా ప్రమాద బీమాను పెంచుతూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. - 8లో



నైపుణ్యతతోనే ఉద్యోగావకాశాలు

తిరుపతి కలెక్టరేట్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న మెగా మల్టీ స్కిల్ వర్క్‌షాప్ ఆదివారంతో ముగిసింది. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	33	25
చిత్తూరు	33	24
తిరుమల	28	21
గూడూరు	34	27
నగరి	34	25

న్యూస్‌రీల్

పకడ్బందీగా ఏపీపీఎస్సీ పరీక్షలు



మాట్లాడుతున్న డీఆర్‌ఓ పెంచల కిషోర్

తిరుపతి అర్బన్ : ఏపీపీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్‌ఓ పెంచల కిషోర్ ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి అక్టోబర్ 6 వరకు (అక్టోబర్ 2న మినహా) 7 రోజులపాటు పరీక్షలు సాగనున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని 3 కేంద్రాల్లో రెండు షెషన్లుగా పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు. మొత్తం 3,363 మంది పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. అభ్యర్థులకు ఇబ్బంది లేకుండా రవాణా సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. సమీక్షలో విద్యుత్ శాఖ అధికారి ప్రభాకర్, ఆర్టీసీ అధికారి సత్యనారాయణ, వైద్యశాఖ నుంచి డాక్టర్ ప్రకాష్, స్పెషల్ బ్రాంచ్ ఎస్‌ఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

'మోత్కుపల్లి'వి ఊసరవెల్లి మాటలు



ఆదిమూలం, ఎమ్మెల్యే, సత్యవేడు

పిచ్చాటూరు : టీడీపీ మాజీ నేత మోత్కుపల్లి నర్సింహులు ఊసరవెల్లి మాటలతో ఎస్సీలను మభ్యపెట్టేందుకు యత్నిస్తున్నారని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మండిపడ్డారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా మోత్కుపల్లి చేసిన వ్యాఖ్యలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం పిచ్చాటూరులో ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో టీడీపీ టికెట్ ఇవ్వకుండా బయటకు గెంటేసిన చంద్రబాబును దొంగ, వెన్నుపోటుదారుడు అంటూ విమర్శించిన మోత్కుపల్లికి ఇప్పుడు అదే బాబు మహాత్ముడు ఎలా అయ్యారో చెప్పాలని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన కేబినెట్‌లో డిప్యూటీ సీఎం, హోంమంత్రితోపాటు పలు కీలక మంత్రిత్వశాఖలను ఎస్సీలకు కేటాయించారని గుర్తుచేశారు. ఎస్సీల అభ్యున్నతికి కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను విమర్శిస్తే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మోత్కుపల్లి మాటల వెనుక ఎవరున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు.

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అర్జీలు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. వినతులు రాసేందుకు ప్రత్యేకంగా ముగ్గురు వీఆర్‌ఓలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. స్పందనకు అన్నిశాఖల ఉన్నతాధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రతి రోజూ సాయంత్రం స్పందన నిర్వహించాలని స్పష్టం చేశారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 74,884 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 32,213 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ. 2.70 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టోకెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టోకెట్లు కలిగిన వారికి 2 గంటల్లో దర్శనమవుతోంది.

బాల్య వివాహాల నిర్మూలనే లక్ష్యం



జయలక్ష్మి

తిరుపతి అర్బన్ : బాల్య వివాహాల నిర్మూలనే లక్ష్యంగా పనిచేయాలని మహిళా శిశు సంక్షేమ సాధికారిత జిల్లా అధికారి జయలక్ష్మి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రభుత్వం స్పష్టమైన జీఓ జారీ చేసిందన్నారు. ఆ మేరకు జిల్లాలోని 12 ఐసీడీఎస్ ప్రాజెక్టులకు ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. సీడీపీఓలు వారి పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు ముందు అవగాహన కల్పించాలని సూచించారు. తర్వాత అంగన్‌వాడీలు తమ పరిధిలోని ప్రజలకు వివరించాలని కోరారు. అమ్మాయికి 18ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు నిండితేనే పెళ్లి చేయాలని స్పష్టం చేశారు. వివాహమైన తర్వాత కౌన్సెలింగ్ ఇవ్వడం కాకుండా ముందే పసిగట్టి వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ క్రమంలోనే జిల్లాలోని 2,492 అంగన్‌వాడీ సెంటర్లకు సమాచారం ఇచ్చామని వెల్లడించారు. అంగన్‌వాడీలు స్థానిక సచివాలయాల్లోని మహిళా పోలీసుల సహకారం తీసుకోవాలని సూచించారు.

బ్రహ్మోండోత్సవం



అశేష భక్తజన సందోహం నడుమ సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు



తిరుగిరుల్లో శ్రీవారి బ్రహ్మోత్సవ వైభవం శోభాయమానంగా సాగుతోంది. సూర్యప్రభ వాహనంపై కొలువుదీరిన ఏడుకొండలస్వామిని దర్శించి భక్తకోటి పరవశించింది. బాల భాస్కరుని లేలేత కాంతుల్లో దేదీప్యమానంగా విరాజిల్లుతున్న దేవదేవుని సన్నిధిలో ప్రణమిల్లింది. ఉభయ దేవేరీ సమేతంగా సుగంధ పరిమళభరిత విశేష అభిషేకంలో సేదతీరిన మలయప్పను వీక్షించి పులకించింది. చల్లటి పిల్లగాలుల నడుమ చంద్రప్రభ వెలుగుల్లో దివ్యతేజస్సుతో అలరారుతున్న వైకుంఠనాథుని సేవించి తరించింది. శ్వేత వర్ణ కలువల అలంకరణలో కటాక్షించిన శ్రీమహావిష్ణువుకు దాసోహమంటూ నమస్సులర్పించింది.



చంద్రప్రభ వాహనంపై కొలువుదీరిన వైకుంఠనాథుడు

- సూర్యప్రభ..చంద్రప్రభ వాహనాలపై విహరించిన శ్రీవారు
- తిరుమంజనంలో సేదతీరిన దేవదేవేరులు
- నేడు రథోత్సవం.. అశ్వవాహన సేవ
- రేపటి చక్రస్నానంతో ఉత్సవాలు పరిపూర్ణం

తిరుమల: తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు కనులపండువగా సాగుతున్నాయి. శ్రీవారికి ఆదివారం ఉదయం సూర్యప్రభ వాహన సేవను వేడుకగా నిర్వహించారు. అనంతరం ఆలయంలోని రంగనాయక మండపంలో మూడో స్నపన తిరుమంజనం జరిపించారు. సాయంత్రం ఆలయం వెలుపల సహస్రదీపాలంకరణ సేవలో స్వామివారు ఊయలూగుతూ దర్శనమిచ్చారు. రాత్రి అశేష భక్త జన సందోహం నడుమ చంద్రప్రభ వాహనసేవ నిర్వహించారు. మాడవీధుల్లో విహరిస్తున్న శ్రీవారి ఎదుట కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆలయంతోపాటు ఫల, పుష్ప ప్రదర్శనశాలలోని అలంకరణలు భక్తులను కట్టిపడేస్తున్నాయి. ఇక నాద నీరాజనం, ఆస్థాన మండపంలో నిర్వహిస్తున్న భక్తి, సంగీత కార్యక్రమాలు అలరించాయి. పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఈఓ ఏవీ ధర్మారెడ్డి పాల్గొన్నారు.

చక్రస్నానానికి పుష్కరిణిలో ఏర్పాట్లు

మంగళవారం ఉదయం చక్రస్నానం నిర్వహించనున్నారు. ఇందుకోసం పుష్కరిణిలో టీటీడీ భారీ ఏర్పాట్లు చేసింది.



నేడు రథోత్సవం.. అశ్వవాహన సేవ

బ్రహ్మోత్సవాలలో భాగంగా ఎనిమిదో రోజు సోమవారం ఉదయం 6.55 గంటలకు శ్రీవారి రథోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా తేరును సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు స్వామివారు అశ్వవాహనంపై మాడ వీధుల్లో విహరించనున్నారు.





సూర్యప్రభ వాహన సేవలో కళాకారుల ప్రదర్శన



వేంకటపతి వైభవం చాటేలా కళా ప్రదర్శన



చంద్రప్రభ వాహన సేవలో టీటీడీ బోర్డు చైర్మన్ భూమన తదితరులు

ప్రభల తేజస్సు

- తుమ్మలగుంటలో కనుల పండువగా బ్రహ్మోత్సవాలు
- సూర్య, చంద్ర ప్రభ వాహనాలపై కల్యాణ వెంకన్న విహారం



సూర్యప్రభ వాహన సేవలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



చంద్రప్రభ వాహనంపై కల్యాణ వెంకన్న చిద్విలాసం

తిరుపతి రూరల్ : తుమ్మలగుంటలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో ఏడో రోజైన ఆదివారం ఉదయం అనంత తేజోమూర్తిగా సూర్యప్రభ వాహనంపై గోవర్ధనగిరిదారుడి అలంకారంలో కల్యాణ వెంకన్న ప్రకాశించారు. ఉదయం ఏడు గంటలకు స్వామి వారు సూర్యప్రభవాహనం అధిష్టించి మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. సరిగ్గా 7.45 గంటలకు స్వామివారిని సూర్య కిరణాలు తాకడంతో ఆలయ అర్చకులు హారతులు సమర్పించారు. భక్తుల గోవిందనామ స్మరణ చేశారు. వాహనసేవ ముందు అశ్వాలు, వృషభాలు ఠీవిగా నడుస్తుండగా, భక్తజన బృందాలు చెక్క భజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళ వాయిద్యాల నడుమ దేవ దేవుని సూర్య ప్రభ ఉత్సవం కోలాహలంగా సాగింది. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు వాహన సేవలో పాల్గొని స్వామివారిని సేవించారు. తుమ్మలగుంట బాల వినాయక కమిటీ చైర్మన్ చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, కమిటీ సభ్యులు వాహన సేవలో పాల్గొన్నారు.

చంద్రశోభితం

బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి చంద్రప్రభ వాహనంపై శ్రీవారు దర్శనం ఇచ్చారు. చంద్రుని వాహనంగా చేసుకుని చల్లని అమృత కిరణాలతో భక్తులకు అభయమిచ్చారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దంపతులు, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న కళారూపాలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా వాహన సేవల ముందు వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు చేపట్టిన ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. కేరళ వాయిద్య కళాకారుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

నేడు రథోత్సవం

శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజైన సోమవారం రథోత్సవం నిర్వహించనున్నారు. ఉదయం 6.00 గంటలకు స్వామి వారు రథారోహణం చేసి పుర వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. అనంతరం రాత్రి 7 గంటలకు అశ్వ వాహనం అధిరోహించి స్వామివారు కటాక్షించనున్నారు.



వాహన సేవల్లో వాద్యకారుల ప్రదర్శన



కల్యాణ వెంకన్నకు సమర్పించేందుకు సారెతో వస్తున్న చంద్రగిరి మండల ప్రజలు

వైభవంగా బంగారు గొడుగు ఉత్సవం



బంగారు గొడుగుతో టీటీడీ బోర్డు చైర్మన్ భూమన,, ఈఓ ధర్మారెడ్డి తదితరులు

తిరుమల : శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆనవాయితీగా ప్రకారం ఆదివారం సాయంత్రం బంగారు గొడుగు ఉత్సవం నిర్వహించారు. రథోత్సవం ముందురోజు శ్రీవారి కల్యాణకట్ట సిబ్బంది ఆధ్వర్యంలో నూతన ఛత్రస్థాపనం చేయడం సంప్రదాయం. అందులో భాగంగా ప్రధాన కల్యాణకట్టలో బంగారు గొడుగుకు ప్రత్యేక పూజలు చేపట్టి, అనంతరం టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి, ఈఓ ఏవీ ధర్మారెడ్డికి స్వర్ణ గొడుగును అప్పగించారు. టీటీడీ చైర్మన్ మాట్లాడుతూ తిరుమలలో మొట్టమొదటి కల్యాణ కట్టను ఏర్పాటు చేసిన పంతులు వంశస్తులు శ్రీవారి రథానికి గొడుగు సమర్పించడం ఆచారంగా వస్తోందన్నారు. శ్రీకృష్ణదేవరాయల కాలంలో ప్రారంభమైన ఈ ఆచారం ఆ తర్వాత మహంతుల పాలనలో కూడా కొనసాగిందని చెప్పారు. 1946లో టీటీడీతో పంతులు గారి వంశస్తులైన ధర్మకర్త శివరామయ్య ఒప్పందం కుదుర్చుకుని కల్యాణకట్టను అప్పగించారని తెలిపారు. ఆ మేరకు శివరామయ్య కుమారుడు రామనాథన్ గత 39 ఏళ్లుగా బంగారు గొడుగుకు పూజలు నిర్వహించి స్వామివారి రథానికి సమర్పిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు యానాదయ్య, డిప్యూటీ ఈఓలు లోకనాథం, సెల్వం, ఏఈఓ రమాకాంతరావు పాల్గొన్నారు.

'వందేభారత్'కు ఘన స్వాగతం

గూడూరురూరల్ : విజయవాడ–చైన్నై మధ్య నూతనంగా ప్రారంభించిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఆదివారం సాయంత్రం గూడూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా అధికారులు, నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ ఘనస్వాగతం పలికారు. రైలులోకి వెళ్లి వసతులను పరిశీలించి ప్రయాణికులతో ముచ్చటించారు. అనంతరం వందేభారత్ రైలుకు జెండా ఊపి చెన్నైకు సాగనంపారు. దేవసేనమ్మ మాట్లాడుతూ వందేభారత్ రైలుకు గూడూరు స్టాపింగ్ ఇప్పించాలని ఎంపీ గురుమూర్తికి విన్నవించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్టేషన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఆరేటి వెంకటేశ్వర్లు, ఆర్‌పీఎఫ్ సీఐ లక్ష్మణరావు, డీఆర్‌యుసీసీ మెంబర్ శ్యామ్‌యాదవ్, నాయకులు కోదండయ్య, గోపాల్‌యాదవ్ పాల్గొన్నారు.



ప్రయాణికులతో మాట్లాడుతున్న పొనకా దేవసేనమ్మ తదితరులు

ఆటో బోల్తా : డ్రైవర్ మృతి

సైదాపురం : మండలంలోని మర్లపూడి గ్రామం వద్ద ఆదివారం ఆటో బోల్తా పడడంతో డ్రైవర్ మృతి చెందాడు. వివరాలు.. రాపూరు మండలం జోరేపల్లెకు చెందిన కటకం పెద్ద పెంచలయ్య(53) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో నిమ్మకాయల లోడ్ తీసుకుని గూడూరుకు వెళుతుండగా మార్గం మధ్యలో కుక్క అడ్డుగా వచ్చింది. తప్పించే క్రమంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. తీవ్రంగా గాయపడిన పెంచలయ్యను స్థానికులు గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరణించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీమా.. మరింత ధీమా!

ఆర్టీసీ సిబ్బందికి ప్రభుత్వం పూర్తి అండదండలందిస్తోంది. ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమ ఫలాలు అందిస్తోంది. అందులో భాగంగా ప్రమాద బీమాను మరింత పెంచుతూ ఆదేశాలు జారీ చేసింది. ఎవరైనా ఉద్యోగి మరణిస్తే వారి కుటుంబానికి వెన్నుదన్నుగా నిలిచేందుకు కార్యాచరణ అమలు చేస్తోంది. బాధితులకు మొత్తం రూ.1.10 కోట్ల వరకు లబ్ధి చేకూరేలా చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయంపై ఆర్టీసీ ఎంప్లాయిస్ హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదే స్ఫూర్తితో సంస్థ అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేస్తామని స్పష్టం చేస్తున్నారు.

- ఆర్టీసీ ఉద్యోగులకు అండగా ప్రభుత్వం
- ప్రమాద భరోసా పెంపుదలకు నిర్ణయం
- గత టీడీపీ హయాంలో కేవలం రూ.3లక్షలే
- ఇప్పటికే రూ.30లక్షలకు పెంచిన వైఎస్సార్‌సీపీ సర్కార్
- మళ్లీ రూ.85లక్షలకు అందించాలని ఆదేశాలు
- బాధిత కుటుంబానికి మొత్తం రూ.1.10 కోట్లకు పైగా చేకూరనున్న లబ్ధి





ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావుకు కృతజ్ఞతలు చెబుతున్న ఉద్యోగ సంఘాల నేతలు (ఇన్‌సెట్) ఆర్టీసీ బస్సు

తిరుపతి అర్బన్ : ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం ద్వారా ఉద్యోగుల దీర్ఘకాలిక కోరికను నెరవేర్చిన ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారు. ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి అనేక సంస్కరణలతో ముందడుగు వేశారు. సిబ్బందిలో ఎవరైన ప్రమాదాల బారిన పడితే వారి కుటుంబాలను ఆదుకునేందుకు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా కార్పొరేట్ శాలరీ ప్యాకేజీ ద్వారా ప్రమాద బీమాను రూ.30లక్షల నుంచి రూ.85లక్షలకు తాజాగా పెంచారు. అలాగే రూపే డెబిట్ కార్డ్ లింకేజీ ద్వారా రూ.10లక్షలు, కొత్త రూపే కార్డ్ ద్వారా మరో రూ.10లక్షలు, సహజ మరణానికి రూ.5లక్షలు చొప్పున చెల్లించనున్నారు. దీంతో మొత్తంగా రూ.1.10 కోట్ల వరకు ఆర్టీసీ ఉద్యోగులకు ప్రమాద బీమా వర్తించనుంది. గత టీటీడీ పాలనలో ప్రమాద బీమా రూ.3లక్షలు, సాధారణ మరణానికి రూ.1.50లక్షలుగా ఉండేది. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రమాద బీమాను రూ.30లక్షలకు, సాధారణ మరణానికి రూ.5లక్షలు పెంచారు. తాజాగా మరో అడుగు ముందుకు వేస్తూ ప్రమాద బీమాను రూ.85లక్షలకు పెంచడంతోపాటు అనుబంధంగా రూ.1.10కోట్లు అందించాలని నిర్ణయించారు. ఈ మేరకు జిల్లాలో సుమారు 6వేల మంది ఆర్టీసీ ఉద్యోగులకు మేలు చేకూర్చనున్నారు.

ఉద్యోగులకు వరం



వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలో 52 వేల మంది ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వోద్యోగులుగా మార్చు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది. గత టీడీపీ పాలనలో ప్రమాద బీమా రూ.3లక్షలు ఉంటే, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.30లక్షలు చేసింది. తాజాగా రూ.85లక్షలకు పెంచడం నిజంగా ఉద్యోగులకు ఓ వరం. ముఖ్యమంత్రికి ఎప్పటికీ రుణపడి ఉంటాం.

- రాచపల్లి దేవరాజులు, రాష్ట్ర అధ్యక్షుడు, ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



ఆర్టీసీ ప్రమాద బీమాను పెద్ద మొత్తంలో పెంచినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు. అలాగే ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్‌కు ప్రభుత్వ గుర్తింపు ఇచ్చినందుకు ఎప్పటికీ రుణపడి ఉంటాం. ఆర్టీసీని బలోపేతం చేస్తున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు. ఉద్యోగికి ఏమైనా అయితే..ఆ కుటుంబం వీధిన పడకుండా పెద్ద మొత్తంలో బీమా చెల్లించి ఆదుకోవడం అభినందనీయం.

- పీఎస్ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్

గొప్ప నిర్ణయం



ఆర్టీసీ ఉద్యోగుల ప్రమాద బీమాను పెంచడం గొప్ప నిర్ణయం. ఆర్టీసీ ఉద్యోగికి రూ.1.10 కోట్ల బీమా వర్తించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టడం సంతోషంగా ఉంది. గతంలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికులను ఉద్యోగులుగా మార్చు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేలు మరువలేం. తాజాగా ప్రమాద బీమాను భారీగా పెంచడం చాలా ఆనందంగా ఉంది.

- చల్లా చంద్రయ్య, రాష్ట్ర అధ్యక్షుడు, ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్

అభినందనీయం



ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయం అభినందనీయం. రూ.30లక్షలున్న ఆర్టీసీ ప్రమాద బీమాను ఏకంగా రూ.85లక్షలకు పెంచడం సంతోషంగా ఉంది. ఉద్యోగులకు అండగా నిలిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు. రాష్ట్రం 52వేల మంది ఆర్టీసీ ఉద్యోగులున్నారు.జిల్లాలో 6వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఉద్యోగులు ప్రాణాలు కోల్పోతే వారి కుటుంబాలు వీధిన పడకుండా బీమా సొమ్ము సాయపడుతుంది.

- సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి, ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్

తుమ్మలగుంటలో అన్నప్రసాదం...నిరంతరం

● రకరకాల వంటకాలతో భోజనం తయారీ ● వందలాదిగా తరలి వస్తున్న భక్తులు



భక్తులకు అన్నదానం చేస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: తుమ్మలగుంట కల్యాణ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా వాహన సేవల్లో పాల్గొనే భక్తులకు నిరంతరం భోజనం, అల్పాహారం పంపిణీ చేస్తున్నారు. ఆలయం వద్ద నిత్యాన్న ప్రసాదాలు పంపిణీ చేస్తుండగా వాహన సేవలను తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చే భక్తులు అందరికీ వివిధ రకాల వంటకాలతో తయారు చేసిన భోజనం, ఉదయం, రాత్రి వేళలో అల్పాహారం అందజేస్తున్నారు. తుడా చైర్మన్, వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి భక్తులకు స్వయంగా భోజనం వడ్డించి ఆత్మీయతను చాటుకుంటున్నారు.

భక్తుల ప్రశంసలు : కల్యాణ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చే భక్తులకు నిరంతరం భోజన సదుపాయం ఏర్పాటు చేయడంపై ప్రశంసలు వస్తున్నాయి. దైవ దర్శనం చేసుకుని ఆకలితో తిరిగి వెళ్లకుండా భోజనం పెట్టడం సంతోషంగా ఉందని పలువురు భక్తులు తెలిపారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

తిరుచానూరు(చంద్రగిరి): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో నిర్వహించిన భరత నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. తిరుపతికి చెందిన నృత్యాంజలి నాట్యమండలి, నాట్య గురువు జైశ్రీ ఆధ్వర్యంలో కళాకారులు ప్రణవి, గీతిషా, శాన్వి, షాలిని, జాహ్నవి, దీక్షిత అద్భుతంగా నాట్యం చేశారు. వారిని ఏఓ ఖాదర్‌వలి సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



కళాకారుల నృత్యభంగిమ

26న సాంస్కృతిక పోటీలు

తిరుపతి కల్చరల్ : వివేకానంద స్వామి జయంతి సందర్భంగా రాష్ట్ర, జాతీయ స్థాయి యువ జనోత్సవాల నేపథ్యంలో ఈనెల 26వ తేదీన యువ కళాకారులకు జిల్లాస్థాయి సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్లు సెట్విన్ సీఈఓ మురళీకృష్ణ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ విజేతలకు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. చిత్తూరు పీవీకేఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న పోటీలకు 15 నుంచి 20 ఏళ్ల యువతీ యువకులు పాల్గొనవచ్చని వెల్లడించారు. జానపద నృత్యాలు, జానపద గీతాలు, జీవన నైపుణ్య విభాగ పోటీలు, కథలు రాయడం, పోస్టర్ తయారీ, ఫొటోగ్రఫీ వంటి అంశాల్లో పోటీలు ఉంటాయని వివరించారు. ఆసక్తి గల వారు ఈనెల 25వ తేదీ సోమవారంలోపు పేరు, పుట్టిన తేదీ, పోటీ చేసే అంశాలను డాక్టర్ పి.జయచంద్రుడు, తెలుగు లెక్చరర్, పీవీకేఎస్ డిగ్రీ కళాశాల, చిత్తూరు, 9703768519 నంబర్‌కు వాట్సాప్, లేదా తిరుపతి సెట్విన్ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 0877-2286921, 9440573537, 7036428762 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అనుమానాస్పదంగా మహిళ మృతి

కోట : మండలంలోని వంజివాకలో ఆదివారం ఓ మహిళ అనుమానాస్పదంగా మృతి చెందింది.. వివరాలు.. గ్రామానికి చెందిన పోతురాజు రమేష్, హరిత(23) దంపతులు నివసిస్తున్నారు. వారికి ఇద్దరు పిల్లలు. ఈ క్రమంలో హరిత ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని మరణించింది. దీనిపై మృతురాలి తండ్రి ఏడుకొండలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తమ కుమార్తె మృతికి ఆమె భర్త రమేష్ కారణమని ఆరోపించాడు. ఎస్‌ఐ పుల్లారావు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబీకులతోపాటు గ్రామస్తులను విచారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.



గ్రామస్తులను విచారిస్తున్న ఎస్‌ఐ పుల్లారావు

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్టు

చిత్తూరు అర్బన్: నగరంలో గంజాయి విక్రయాలపై దాడులు నిర్వహించి కె.మురుగన్ (56), ఎస్.ఉమాపతి (56), పి.వెంకటేష్ (32)ను వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం నిందితుల అరెస్టును చూపి, సీఐ విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ కట్టమంచి పరిసర ప్రాంతాల్లో సిబ్బందితో కలిసి ఆదివారం దాడులు నిర్వహించగా రూ.2 లక్షల విలువైన 6 కిలోల గంజాయి లభించిందని తెలిపారు.

రాష్ట్ర స్థాయి రెజ్లింగ్‌లో 'పేట' క్రీడాకారుల ప్రతిభ

నాయుడుపేట : ఎన్టీఆర్ జిల్లా నున్న పట్టణంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో నాయుడుపేట క్రీడాకారులు ప్రతిభను కనబరచి పతకాలు సాధించినట్లు కోచ్ బి.ఉదయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ చాంపియన్ షిప్‌లో ఈ.రిష, ఎస్.సంతోష్ బంగారు పతకాలు, జి.రామాంజనేయులు వెండి పతకం దక్కించుకున్నట్లు వెల్లడించారు. గోల్డ్ మెడల్స్ సాధించిన ఇద్దరు క్రీడాకారులు అక్టోబర్‌లో ఢిల్లీలో నిర్వహించే జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు హాజరుకానున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా వారికి రెజ్లింగ్ సంఘం వైస్ ప్రెసిడెంట్ కలికి సుధీప్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ దారా రవి అభినందనలు తెలిపారు.



క్రీడాకారులతో కోచ్ ఉదయ్‌కుమార్

నైపుణ్యతతోనే ఉద్యోగావకాశాలు

- రాబోవు రోజుల్లో మరిన్ని వర్క్‌షాప్‌లు
- సెట్విన్ సీఈఓ మురళీకృష్ణ

తిరుపతి అర్బన్: చదువుతోపాటు నైపుణ్యాలు పెంపొందించుకుంటే ఉద్యోగావకాశాలు సులువుగా పొందగలరని, ఆ దిశగా యువతలో నైపుణ్యాల పెంపునకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని సెట్విన్ సీఈఓ మురళీకృష్ణ అన్నారు. కలెక్టరేట్‌లో రెండ్రోజుల మెగా మల్టీ స్కిల్ వర్క్‌షాప్ ఆదివారం సాయంత్రం ముగిసింది. తొలిసారి యువజనశాఖ నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌కు యువత నుంచి అనూహ్య స్పందన లభించింది. వివిధ విద్యాసంస్థల నుంచి 200మంది పైచిలుకు విద్యార్థులు హాజరయ్యారు. ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, మంత్రి రోజా నుంచి లభించిన ప్రోత్సాహంతో రానున్న రోజుల్లో మరిన్ని వర్క్ షాపులు యువతకు నిర్వహిస్తామన్నారు. సృజన టెక్నాలజీ వ్యవస్థాపక చైర్మన్ పి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, తాను చదువుకునే రోజులతో పోల్చితే ఇప్పుడు టెక్నాలజీ సేవలు బహుముఖంగా విస్తరించి అందుబాటులోకి వచ్చాయని, వీటితో విద్యార్థులు తమ ఉజ్వల భవితకు బాటలు వేసుకోవాలని..సామాన్య పేద రైతు కుటుంబం నుంచి తానీ స్థాయికి చేరుకోవడం వెనుక పడిన కష్టాలను స్ఫూర్తిదాయకంగా వివరించారు. బాలాజీ నర్సింగ్ కాలేజీ చైర్మన్ డాక్టర్ వై. ప్రవీణ్ మాట్లాడుతూ, మల్టీ స్కిల్స్‌పై యువతకు సెట్విన్ శిక్షణ ఇవ్వడం అభినందనీయమని, క్రమం తప్పకుండా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తే తనవంతు సహకారం అందిస్తానన్నారు. అనంతరం విద్యార్థులకు శిక్షణకు సంబంధించి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.



సర్టిఫికెట్ అందిస్తున్న నిర్వాహకులు

సెల్‌ఫోన్ల వాడేటప్పుడు ఒళ్లు జాగ్రత్త!

యువతకు 'దిశ' నిర్దేశం

స్మార్ట్ ఫోన్లను యువత ఒళ్లు జాగ్రత్తగా పెట్టుకుని వాడకపోతే చేదు అనుభవాలు చవిచూడాల్సి వస్తుందని 'దిశ' పోలీసులు ఆశ, స్వాతి హెచ్చరించారు. అంతకుముందు ఉదయం సెషన్‌లో సైబర్ నేరాల, డ్రగ్స్ వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. 'దిశ' యాప్‌తో ఇటీవల నెల్లూరులో ఓ విద్యార్థిని, తిరుపతిలో ఓ మహిళ ఎలా సురక్షితంగా బైటపడ్డారో వివరించారు. విద్యార్థినుల చేత యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. అలాగే పవన్ దేవరకొండ, చక్రధర్, గురు మనోజ్, కిషోర్, ఏ.గీత, పర్షియా, హేమంత్ చరణ్ తదితరులు వివిధ సెషన్లలో పలు అంశాలపై ప్రసంగించారు. సెట్విన్ మేనేజర్ మోహన్ కుమార్, సూపరింటెండెంట్ జమునారాణి, మధుసూదన్‌రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భార్యను కడతేర్చిన భర్త

కలువాయి : కట్టుకున్న భార్యను భర్తే కడతేర్చిన ఘటన ఆదివారం వేకువజామున మండలంలోని తోపుగుంట దళితవాడలో జరిగింది. వివరాలు.. గ్రామానికి చెందిన వల్లం ఆదెమ్మ కుమార్తె అపర్ణకు నెల్లూరుకు చెందిన ప్రభుతో 12 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో వినాయక చవితికి అపర్ణ తన భర్తతో కలిసి పుట్టింటికి వచ్చింది. వినాయక విగ్రహం నిమజ్జనం సందర్భంగా ప్రభుకు స్థానిక యువకుడికి స్వల్ప ఘర్షణ జరిగింది. అపర్ణ తన తల్లి సూచన మేరకు భర్తకు సర్దిచెప్పి ఇంటికి తీసుకెళ్లింది. అయితే ఇది అవమానంగా భావించిన ప్రభు దీనిపై మండిపడ్డాడు. రాత్రి ఇంట్లో అత్త, భార్యతో గొడవపడ్డాడు. రేపు గ్రామ పెద్దలతో ఈ విషయం మాట్లాడి పరిష్కరించుకుందామని అత్త ఆదెమ్మ చెప్పడంతో భార్యతో కలిసి ఇంట్లోకి వెళ్లాడు. ఆరు బయటే ఆదెమ్మ నిద్రించింది. ఉదయం ఇంట్లోకి వెళ్లి చూడగా మంచంపై రక్తపుమడుగులో కుమార్తె అపర్ణ మృతదేహం కనిపించింది. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించింది. అల్లుడే తన కుమార్తెను రోకలిబండతో తలపై కొట్టి చంపేసి పరారయ్యాడని ఫిర్యాదు చేసింది. ఇన్‌చార్జి సీఐ రవినాయక్, ఎస్‌ఐ మహేంద్ర హుటాహుటిన గ్రామానికి చేరుకుని ఘటనాస్థలాన్ని పరిశీలించారు. అపర్ణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



స్థానికులను విచారిస్తున్న పోలీసులు

తండ్రి మందలించాడని ఆత్మహత్య

వరదయ్యపాళెం: వినాయక నిమజ్జనోత్సవానికి వెళ్లి స్నేహితులతో సరదాగా గడిపినందుకు తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురై ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. వరదయ్యపాళెం మండలం, గూడలవారిపాళెం పంచాయతీ రామకృష్ణాపురానికి చెందిన మోహన్ కుమారుడు హరికృష్ణ (23) అపాచీ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం గ్రామంలో నిర్వహించిన వినాయక విగ్రహ నిమజ్జనోత్సవంలో పాల్గొన్నాడు. దీనిపై తండ్రి మోహన్ కోప్పడ్డాడు. దీంతో హరికృష్ణ సీఎల్ఎన్‌పల్లె పంచాయతీలోని వీరాస్వామినగర్ వద్ద ఈద్గా మైదానంలో శీతల పానీయంలో పురుగుల మందును కలిపి తాగేశాడు. స్థానికుల సమాచారం మేరకు ఎస్‌ఐ నాగార్జునరెడ్డి, సిబ్బందితో కలసి ఘటనా స్థలంకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి కుటుంబీకులకు సమాచారం అందించారు. సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి మృత దేహాన్ని తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.